సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



విద్యా స్వరూపిణీ నమోస్తుతే!

విజ్ఞానదేవి సరస్వతి అవతరించిన పుణ్యదినమే వసంత పంచమి. ఈ రోజున పాఠశాలల్లో పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు. -8లో



మేధావుల మౌనం దేశానికి నష్టం

మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం అని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.120	రూ.170



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 33 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	726	726
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 97.360 కిలోలు

న్యూస్‌రీల్

తలనీలాల కోసం 4న వేలంపాట



సిద్దవటం: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల పోగు హక్కు కోసం ఈనెల 4వ తేదీ బహిరంగ వేలం పాట నిర్వహించనున్నారు. సిద్దవటంలోని రంగనాయక స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందని ఆలయ ఈఓ. మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.నిత్యపూజ స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు జరగుతాయన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ధరావత్తు కింద లక్ష రూపాయలు చెల్లించాలన్నారు. మిగిలిన షరతులను వేలం పాట సమయంలో తెలియజేస్తామని ఆయన చెప్పారు.

8న నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష

రాజంపేట: నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష ఈనెల 8న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట మండలం నారమరాజుపల్లె వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వతరగతిలో (2025–2026) సంవత్సరానికి పరిమితసీట్ల కోసం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నారు. 9వ తరగతి విద్యార్థులకు రాజంపేటలో 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 11వ తరగతి విద్యార్థులకు నవోదయ విద్యాలయం, నారమరాజుపల్లెలో పరీక్షా కేంద్రంగా ఏర్పాటుచేశామన్నారు.అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.విద్యార్థులకు సమస్యలు ఎదురైతే 7013635980, 9398780145, 9490466759 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గంగమ్మా..కాపాడమ్మా



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిలాడింది. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు గంగరాజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గంగమ్మా..అందరూ చల్లగా ఉండేలా కరుణించి కాపాడు తల్లీ అని వేడుకున్నారు.పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

5న జాబ్ మేళా

కడప ఎడ్యుకేషన్: కడప కాగితాలపెంటలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో 5వ తేదీ ఉదయం 10 గంటలకు ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు శ్రీకాళహస్తికు చెందిన ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్, కడపకు చెందిన షిర్డిసాయి ఎలక్ట్రికల్స్, రేణిగుంట అమర్ రాజాతోపాటు కడపలోని మరిన్ని కంపెనీలు హాజరవుతాయని పేర్కొన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేళాలో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ. 13 వేల నుంచి రూ. 18 వేల వరకు ఉంటుందని వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హత మార్కుల జాబితాలు, రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు, బయోడేటా, జిరాక్స్ కాపీలతో నేరుగా జాబ్‌మేళాకు హాజరు కావాలని ఏడీ రత్నరాజు తెలిపారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, బాగా చదివి మంచి మార్కులతో ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కొంత మంది డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యసాధనకు కష్టపడాలని సూచించారు.

కూటమిగా పేకాట

- వైఎస్సార్ జిల్లాలో అనధికార పేకాట క్లబ్‌లు ఏర్పాటు
- అక్రమ ఆదాయం కోసం అడ్డదారులు ఎంచుకున్న కూటమి నేతలు
- స్వయానా బీజేపీ ఎంపీ రమేష్‌నాయుడు ఫిర్యాదు
- అనకాపల్లి ఎంపీ గుర్తించినా కళ్లు తెరవని జిల్లా యంత్రాంగం



వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌కు సీఎం రమేష్ రాసిన లేఖ





సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లాలో పేకాట క్లబ్బు గబ్బు జోరుగా సాగుతోంది. పులివెందుల మొదలు జమ్మలమడుగు.. ప్రొద్దుటూరు ఇలా నలు దిక్కులా విస్తరిస్తోంది. అక్రమ ఆదాయమే లక్ష్యంగా కూటమి నేతలు బరితెగిస్తున్నారు. మూడు భూ ఆక్రమణలు.. ఆరు పేకాట క్లబ్బులతో చెలరేగిపోతున్నారు. అనధికార క్లబ్బుల విషయంలో సాక్షాత్తు కూటమి ఎంపీ ఫిర్యాదు చేయడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా అనధికార క్లబ్‌లు యథేచ్ఛగా సాగుతున్నా.. వీటి దెబ్బకు కుటుంబాలు గుల్లవుతున్నా... జిల్లా యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నిఘా వర్గాలు నివేదించినా కిమ్మనడం లేదు. అనధికార పేకాట క్లబ్బులు జమ్మలమడుగు, పులివెందుల సబ్ డివిజన్లలో మరింత అధికంగా ఉన్నాయి. సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేశారని వందలాది మందిని గుర్తించి నోటీసులు జారీ చేసిన పోలీసులకు అనధికార పేకాట క్లబ్‌లు నిర్వహణ పట్టకపోవడం గమనార్హం.

- ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టగానే కూటమి నేతలు దందాలు, దౌర్జన్యాలకు బరితెగించారు. మరోవైపు ప్రభుత్వ భూములతో పాటు సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘిస్తూ చెరువు, వంక పోరంబోకు భూములను సైతం ఆక్రమిస్తున్నారు. ఇలాంటి చర్యలకు జిల్లాలో రెవెన్యూ, పోలీసు శాఖల అండదండలు ఉండడంతో మరింతగా రెచ్చిపోయి స్వాహా పర్వాన్ని అందుకున్నారు. కట్టడి చేయాల్సిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అటు దిశగా సమీక్ష కూడా చేపట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు పోలీసు వ్యవస్థను చెప్పు చేతల్లో పెట్టుకొని విచ్చలవిడి దౌర్జన్యాలకు దిగుతూ, అక్రమ ఆదాయం కోసం అడ్డదారులు ఎంచుకున్నారు. ఈక్రమంలో నిజాయితీపరుడిగా ముద్రపడ్డ ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు అర్ధాంతర బదిలీ బహుమానంగా ఇచ్చారు. తాజాగా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ బాధ్యతలు చేపట్టినా కిందిస్థాయి సిబ్బంది ఆశించిన మేరకు సమాచారం ఇవ్వడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.

పులివెందులలో మొదలు...

అనధికార పేకాట క్లబ్‌ల నిర్వహణ తొలుత పులివెందుల సబ్ డివిజన్‌లో మొదలైంది. ట్రిబుల్ స్టార్ అధికారుల చొరవ, ప్రోత్సాహం, అధికార పార్టీ నేతల అండదండలతో తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా కొనసాగించారు. ఇటీవల ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవీంద్రనాథరెడ్డిల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా తాత్కాలికంగా తెరపడినట్లు తెలుస్తోంది. ఈజాడ్యం జమ్మలమడుగు సబ్ డివిజన్, అటునుంచి ప్రొద్దుటూరు సబ్ డివిజన్ దాకా విస్తరించింది. పేకాట క్లబ్‌ల్లో సైతం రూ. లక్షల్లో జూదం ఆడుతున్నారు. జమ్మలమడుగులో పేకాట క్లబ్ దేవగుడికి చెందిన నాగేశ్వరరెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు స్వయంగా ఎంపీ సీఎం రమేష్‌నాయుడు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. అంటే ఏస్థాయిలో పేకాట నిర్వహిస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అనకాపల్లె ఎంపీ గుర్తించేంతవరకూ జిల్లా యంత్రాంగానికి తెలియదనుకోవాలా? తెలిసినా కూటమి ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతోనే మిన్నకుండి పోయారా? ఇలాంటి ప్రశ్నలకు జిల్లా అధికార యంత్రాంగం వద్ద జవాబు కొరవడింది.

నీరుగారుతున్న వ్యవస్థ...

కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలు సర్వనాశనం అవుతున్నాయనేదానికి చాలా ఉదాహరణలు చెప్పుకోవచ్చు. వేముల మండలంలో టిఫిన్ కంపెనీకి చెందిన కోట్లాది రూపాయల విలువైన 2వేల పైబడి టన్నుల బెరైటీస్ రాత్రికి రాత్రి లూటీ చేశారు. సంక్రాంతి పండుగ రోజు భారీ టిప్పర్లతో తెల్లారేలోపు తరలించుకుపోయారు.దీనిపై టిఫెన్ కంపెనీ కేర్‌టేకర్ రామలింగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెరైటీస్ ఖనిజం ఫలానా చోటికి తరలించారని స్పష్టంగా వివరించినా, అందుకు బాధ్యులు పేర్ల పార్థసారధిరెడ్డి, పేర్ల శేషారెడ్డి, మబ్బుచింతలపల్లె శ్రీనాథరెడ్డిలంటూ ఫిర్యాదు చేసినా కనీసం ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. ఇప్పటికీ ఫిర్యాదుదారుడికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అధికార పార్టీ నేతల సిఫార్సులు లేకపోతే, కనీసం ఎఫ్ఐఆర్ కూడా నోచుకోవడం లేదంటే పోలీస్ వ్యవస్థ ఎలా ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఇక అనధికార పేకాట క్లబ్‌లు కట్టడి చేయడానికే దమ్ము, ధైర్యం లేని దుస్థితిలో జిల్లా పోలీసుశాఖ ఉంటోందని పలువురు వాపోతున్నారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి ఎలా ఉన్నా, కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడి పేకాట నిర్వహణ సాధ్యమైందని విశ్లేషకులు దెప్పి పొడుస్తుండడం గమనార్హం.

గరుడుని పై ఘనశ్యాముడు



గరుడ వాహనంపై కడపరాయుడు

కడప కల్చరల్: ఆ క్షేత్రం మాడవీధులన్నీ భక్తి భావంతో భజనలు చేస్తున్న భక్తులతో నిండిపోయాయి. ఒకవైపు మంగళ వాయిద్యాల హోరు...మరోవైపు కళాకారుల కోలాటాలు...ప్రతిధ్వనించిన గోవిందనామ స్మరణలు.... దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల శోభ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం స్వామి ముత్యపు పందిరివాహనంలో మాడవీధుల్లో విహరించారు. శ్వేతపందిరి నీడన రాజగోపాలుడిగా గంభీరంగా ఆశీనులైన స్వామి వారిని భక్తులు దర్శించుకుని పూజాద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం తన దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులను కరుణించేందుకు ఘనశ్యాముడు విష్ణుమూర్తి గరుడునిపై కొలువుదీరాడు. సకల ఆయుధాలను ధరించి విహగ వరునిపై విహాయస వీధుల నుంచి ఇలకు దిగి ముల్లోకాలను కటాక్షిస్తూ ఆ మాడవీధుల్లో సాగాడు. భక్తులు స్వామి విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న ఆ దివ్య తేజోరూపుడిని దర్శించుకుని తన్మయులై అడుగడుగునా గోవిందనామ స్మరణలతో తరించారు.

నేడు కల్యాణోత్సవం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు.



గరుడ సేవలో పాల్గొన్న భక్తులు

1500 లీటర్ల అక్రమ స్పిరిట్ స్వాధీనం

ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు



స్పిరిట్ క్యాన్లు, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

రాజంపేట: మండలంలోని బోయనపల్లెలో ఆదివారం 1500 లీటర్ల అక్రమ స్పిరిట్‌ను ఎక్సైజ్‌పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజంపేట ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ జయరాజ్ వివరాలను వెల్లడించారు. కేరళ రాష్ట్రంలో కొనుగోలు చేసి.. బోయనపల్లెలోని గొడౌన్‌లో 50 క్యాన్లలో నిల్వ ఉంచిన 1500 లీటర్ల స్పిరిట్‌ను గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించి ఓబులవారిపల్లె మండలానికి చెందిన చిన్నంరాజు, జగన్‌రాజులను అరెస్టు చేసినట్లు చెప్పారు. సమావేశంలో కడప అసిస్టెంట్ కమిషనరు పీ.చంద్రశేఖర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ మధుసూదన్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగింద్రా, రాజంపేట ఎక్సైజ్ సీఐ మల్లిక తదితరులు పాల్గొన్నారు. కాగా అక్రమ మద్యం తయారీ కోసం ఈ స్పిరిట్‌ను గోడౌన్లలో ఉంచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

5న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు

పోస్టర్లు విడుదల చేసిన నేతలు



ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు ఆకేపాటి అమరనాథరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఫయాజ్‌బాషా తదితరులు

రాయచోటి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఫిబ్రవరి 5వ తేదీ ఫీజు పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 8 నెలల పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క కార్యక్రమం కూడా చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. రైతు సమస్యలు, పెంచిన విద్యుత్ ఛార్జీలపై వైఎస్సార్‌సీపీ ఇప్పటికే ఆందోళనలు చేసిందన్నారు. ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలని నాడు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రవేశపెట్టారన్నారు. దీంతో ఎందరో ఐటీ నిపుణులుగా, ప్రొఫెషనల్ కోర్సులతో తమ జీవితాలను మెరుగుపరచుకున్నారని తెలిపారు. నేడు చంద్రబాబు పేద, మధ్య తరగతి విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పక్షాన ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను చేపడుతున్నామని అమరనాథరెడ్డి చెప్పారు. సమావేశంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, స్థానిక కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- కిరణ్ మదనపల్లె పట్టణంలోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రాత్రి 11 వరకు పుస్తకాలతో కుస్తీపడతాడు. ఉదయం పాఠశాలకు వెళ్లినప్పుడు టీచర్ ప్రశ్నలు అడిగితే సమాధానాలు చెప్పలేకపోతున్నాడు. రాత్రి చదివిందంతా ఉదయానికి గుర్తు చేసుకోలేకపోతున్నాడు.
- మదనపల్లెకు చెందిన రమ్య ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. పరీక్షల్లో మార్కులను ప్రామాణికంగా తీసుకుని బాగా చదువుతోంది. తొలుత ఎఫ్–1 సెక్షన్‌కు ప్రమోట్ చేశారు. ఆ సెక్షన్‌లోని సహచర పిల్లలతో పరిచయాలు పెంచుకుని నిత్యం హుషారుగా కాలేజీకి వెళుతోంది. 10 రోజుల క్రితం మళ్లీ సెక్షన్లు మార్చారు. అంతగా చదవడం లేదని ఈసారి ఆ బాలికను ఎఫ్–3 సెక్షన్‌కు డిమోట్ చేశారు. దీనిని అవమానంగా (ఇన్సల్ట్) భావించి సదురు విద్యార్థిని అన్నం తినకపోవడం, సరిగా నిద్రపోకపోవడం వంటివి చేస్తోందని గుర్తించి తల్లిదండ్రులు సైకాలజిస్టును సంప్రదించారు.
- వాల్మీకిపురానికి చెందిన తరుణ్ ఓ ప్రైవేటు పాఠశాలలో పది చదువుతున్నాడు. గతంలో బాగా మొబైల్ ఫోన్లో ఆటలాడటం, సినిమాలు చూడటం వంటివి చేసేవాడు. పరీక్షలు దగ్గరపడటంతో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు వాడకాన్ని కట్టడి చేశారు. దీన్ని తట్టుకోలేక ఫోన్ ఇవ్వపోతే పాఠశాలకు వెళ్లనని మొండికి వేశాడు. దీంతో తల్లిదండ్రులు దిక్కుతోచని

ఇలాంటి ఉదంతాలు ప్రస్తుతం జిల్లాలో నిత్యం చోటు చేసుకుంటున్నాయి..

ఒత్తిడిని జయించు.. విజయం సాధించు



స్పెషల్ క్లాసులో ఇంటర్మీడియట్ విద్యార్థులు

పదోతరగతి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు: **21,468** మంది
పరీక్షలు జరిగే తేదీలు: మార్చి **17** నుంచి **31** వరకు
ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం: **15,356** మంది
ద్వితీయ సంవత్సరం: **14,248** మంది
పరీక్షలు ప్రారంభమయ్యే తేదీ:
ప్రథమ సంవత్సరం: మార్చి **1** నుంచి
ద్వితీయ సంవత్సరం: మార్చి **3** నుంచి


- విద్యార్థులు ప్రణాళికతో చదవాలి
- నిపుణుల సూచనలు

మదనపల్లె సిటీ: పది, ఇంటర్ విద్యార్థులు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. పలువురు సైక్రియాటిస్టులను సంప్రదిస్తున్నారు. పది పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి మార్చి 31 వరకు జరగనున్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మార్చి 1 నుంచి,ద్వితీయ సంవత్సరం మార్చి 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలలు, కాలేజీల్లో ర్యాంకులు,మంచి మార్కులు సాధించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో విద్యార్థులు డిప్రెషన్‌కు లోనవుతున్నారు. ఈ క్రమంలో వారు నేర్చుకున్న పాఠాలు మరచిపోతున్నారు. మరి కొందరు అన్నం సరిగా తినడం లేదు. మరికొందరు పాస్ అవుతామా లేదే అనే ఆందోళనకు గురవుతున్నారు. పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో తెలియక మానసిక ఒత్తిడితో సతమతమవుతున్నారు. మరో వైపు కొందరు తల్లిదండ్రులు మంచి మార్కులు సాధించాలని ఒత్తిడి పెంచడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఒత్తిడిని జయించాలని, ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

అధిగమించాలిలా....



- గతంలో పది,ఇంటర్,జెఈఈ పరీక్షలు రాసిన సీనియర్ విద్యార్థులు ఎలా సన్నద్ధమయ్యారో తెలుసుకుని అందుకు తగ్గ టైం టేబుల్ రూపొందించుకుని ఆచరించాలి.
- చదవకపోతున్నా ..ఇంకేమైన ఆందోళనతో బాధపడుతుంటే వెంటనే తల్లిదండ్రులతో పంచుకోవాలి.
- చదవకపోతే టీచర్లు దండిస్తారని, మార్కులు తగ్గితే తల్లిదండ్రులు ఆగ్రహిస్తారని భావించి వారికి దూరంగా ఉండకూడదు. ఆ సమయంలో వారిచ్చే సూచనలు ఉపకరిస్తాయి.
- నిత్యం మానసిక ప్రశాంతత కోసం యోగా చేయించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి.
- విద్యార్థి ఒత్తిడికి గరవుతున్నాడని భావిస్తే తల్లిదండ్రులు అతనితో సరదాగా గడపాలి. ఈ సమయంలో పుస్తకాలు పక్కన పెట్టించాలి.
- పరీక్షలు ముగిసే వరకు టీవీలు, సెల్‌ఫోన్ల వాడకానికి స్వస్తి పలకాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లలకు నచ్చజెప్పాలి. ఏది చేసినా పిల్లల సమ్మతితో చేస్తే మానసికంగా వారు అందుకు సంసిద్ధమవుతారు.
- తేలిగ్గా అరిగే ఆహారం తీసుకోవాలి. కచ్చితంగా 7–8 గంటల సేపు నిద్రపోవాలి.



కేసులు పెరిగాయి



టెన్త్, ఇంటర్ చదివే విద్యార్థులు అనేక మంది కౌన్సెలింగ్ కేంద్రానికి వస్తున్నారు. వారితో మాట్లాడితే దడ, వణుకు వస్తుందని, ఛాతీలో నొప్పి ఉంటోందని, నోరు ఎండిపోతుందని చెబుతున్నారు. పరీక్షలు రాయలేమని, ఏం చదివినా గుర్తుండటం లేదని.. ఇలా అనేక కారణాలు చెబుతున్నారు. సమస్యలు విని బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వాటిని అధిగమించడానికి కూర్చోబెట్టి కౌన్సెలింగ్ చేస్తున్నాం. –చాముండేశ్వరి, సైక్రియాటిస్టు, మదనపల్లె

ఒత్తిడి తగ్గించే ప్రణాళిక



పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో ఒత్తిడి తగ్గించేలా ప్రణాళికలు చేశాం. టైం టేబుల్ ప్రకారం చదివిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన మేరకు చదివిస్తున్నాం. పిల్లల విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. –ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ,మదనపల్లె

క్లుప్తంగా

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

తంబళ్లపల్లె : పిచ్చికుక్క దాడిలో నలుగురు గాయపడిన సంఘటన పెద్దమండ్యం మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు దట్టేనాయక్ తాండాకు చెందిన దేవలమ్మ (70), క్రిష్ణానాయక్(40), కేతిరెడ్డిగారిపల్లెకు చెందిన నరసమ్మ(50), జగదీష్(8) లపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వెంటనే గ్రామస్తులు వెంబడించి కుక్కను కర్రలతో కొట్టి చంపారు. బాధితులను తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఆదివారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. చాలా రోజుల నుంచి మండల కేంద్రంలో యాచిస్తూ రైల్వేస్టేషన్‌లో నిద్రపోయేవాడు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఎంతసేపటికీ లేవకపోవడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ పి.మహేష్ పరిశీలించి అంత్యక్రియలు ఏర్పాటు చేశారు.

'నా జాగా ఇప్పించండి'



జాగా చూపిస్తున్న పెంచలమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : తన జాగా తనకు అప్పగించాలని ఓ వృద్ధురాలు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తోంది. రైల్వేకోడూరు పట్టణం తిరుపతి రోడ్డులో ఒకటిన్నర అంకణం జాగా 1998లో పూల సుబ్బలక్ష్మమ్మ దగ్గర కొనుగోలు చేశానని రెడ్డివారిపల్లికి చెందిన జి.పెంచలమ్మ అనే వృద్ధురాలు తెలిపింది. తన జాగాలో సిమెంటు రోడ్డు వేశారని సర్వే జరిపి తన జాగా తనకు అప్పగించాలని రెవెన్యూ అధికారుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నానని పేర్కొంది. తనను ఇల్లు కట్టుకోకుండా కొందరు అడ్డుకుంటున్నారని వాపోయింది. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

కారు, ద్విచక్రవాహనం ఢీ

లింగాల : లింగాల మండలం చిన్నకుడాల గ్రామ సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన మదన్‌మోహన్, పెద్దక్కలు కారులో అనంతపురం జిల్లా నార్పలలో గృహ ప్రవేశ కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా, చిన్నకుడాల గ్రామ సమీపంలో పఠాన్ కమాల్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో పులివెందుల నుంచి పెద్దకుడాల గ్రామానికి వస్తుండగా కారు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కారులో ఉన్న మదన్ మోహన్, పెద్దక్క, ద్విచక్రవాహనంలో ఉన్న పఠాన్ కమాల్ తీవ్రంగా గాయపడ్డారు.

విద్యా స్వరూపిణీ నమోస్తుతే!

- నేడు వసంత పంచమి
- అక్షరాభ్యాసానికి దివ్యమైన రోజు

రాజంపేట టౌన్ : సమస్త విద్యలతో సకల కళలతో అశేష విజ్ఞానదేవి సరస్వతి అవతరించిన పుణ్యదినమే వసంత పంచమి. మాఘశుద్ధ పంచమిరోజు జరుపుకునే ఈ వేడుకను సరస్వతి జయంతి, మదనపంచమి వంటి పేర్లతో కూడా పిలుచుకుంటారు. ఇది రుతు సంబంధమైన పర్వం. వసంత రుతువుకి స్వాగతం పలికే పండుగగా శాస్త్రాల్లో ఉంది. వసంత పంచమిని విద్యారంభ దినోత్సవంగా భావిస్తారు. వసంత పంచమిని పురస్కరించుకొని పాఠశాలల్లో, దేవాలయాల్లో పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు. 'సర్వచైతన్య రూపాంతాం ఆద్యం విద్యాం చ ధీమహి బుద్ధి యోనఃప్రచోదయాత్' అంటూ వ్యాసుడు అమ్మకు ఆదీ అంతాలు లేవంటూ స్తుతించాడు. మూల ప్రకృతికి వ్యక్త రూపాలైన గణేశ, రాధ, లక్ష్మీ, సరస్వతి, సావిత్రి రూపాల్లో ఒకరిగా సరస్వతిని దర్శించాడు. సాక్షాత్తు బ్రహ్మదేవుడే....సరస్వతిని పూజించి బ్రహ్మజ్ఞానాన్ని పొందాడని ఇతిహాసాల్లో పేర్కొన్నారు. జ్ఞానానికి ఆదిదేవత సరస్వతి. సరస్వతీదేవి జ్ఞాన స్వరూపిణి. శాస్త్రం, కళలు, విజ్ఞానం, హస్తకళలు తదితర వాటిని చదువుల తల్లి సరస్వతి అంశగా మన పండితులు భావిస్తారు. సృజనాత్మక శక్తికి, స్ఫూర్తికి వీణాపాణి అయిన సరస్వతిని సంకేతంగా చెబుతారు. వసంత పంచమిని పురస్కరించుకొని సోమవారం పాఠశాలల్లో, వివిధ దేవాలయాల్లో అక్షరాభ్యాస కార్యక్రమాలను చేపట్టనున్నారు.



రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సరస్వతీదేవి విగ్రహం

సకల శుభాలు

వసంత పంచమి రోజు అమ్మవారిని తలుచుకుంటే సకల శుభాలు కలుగుతాయని పెద్దలు చెబుతున్నారు. వాగేశ్వరి, మహాసరస్వతి, సిద్ధసరస్వతి, నీలసరస్వతి, వాగ్దేవి సరస్వతి సామాంపాతు సరస్వతి అనే మకుటంతో ఉన్న శ్లోకాలతో ధ్యానం చేస్తే సరస్వతీదేవి అపార జ్ఞానరాశి ప్రసాదిస్తుందని పురోహితులు చెబుతున్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

వసంత పంచమిని పురస్కరించుకొని పట్టణంలోని అమ్మవారిశాలలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల లోపు చదువుల తల్లి సరస్వతీదేవి పూజ నిర్వహించి సామూహికంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించాలనుకుంటే ఉదయం 8 గంటలకు అమ్మవారిశాలకు చేరుకోవాలని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి సరస్వతీదేవికి కుంకుమార్చన కార్యక్రమం ఉంటుందన్నారు.

అక్షరాభ్యాసానికి శ్రేష్ఠమైన రోజు



మాఘమాసం నవ చైతన్య వికాసానికి, సరస్వతీదేవి మనోవికాసానికి ప్రతీక. అందువల్ల పిల్లల అక్షరాభ్యాసానికి వసంత పంచమి ఎంతో శ్రేష్ఠమైనది. పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా సరస్వతీదేవిని పూజించడం వల్ల స్తబ్దత, ఉదాసీనత తొలగిపోతుంది.

– యతిరాజం హరినాథ్, వేదపండితుడు, రాజంపేట

మెడికల్ కాలేజీ పీపీపీలోకి వద్దంటే అరెస్ట్ చేస్తారా?



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

మదనపల్లె : అన్నమయ్య జిల్లా సంబేపల్లెలో సీఎం చంద్రబాబునాయుడు బహిరంగసభలో మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలోకి మార్చవద్దని, జీఓ నంబర్ 107, 108 రద్దుచేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని నినాదాలు చేసిన వారిని అరెస్టు చేయడం ఎంతవరకు సబబని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు ప్రశ్నించారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పోలీస్ అధికారులు ప్రజల ప్రాథమిక హక్కుపై ఉక్కు పాదం మోపుతున్నారన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. సీఎం సభలో ఏఐఎస్ఎఫ్ నాయకుల పట్ల జిల్లా ఎస్పీ, సంబేపల్లి ఎస్ఐ, సీఐ వ్యవహరించిన తీరు దుర్మార్గమన్నారు. వీరిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నేతల అరెస్టు దుర్మార్గం



మాట్లాడుతున్న మండెం సుధీర్ కుమార్

రాయచోటి అర్బన్ : ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, నిర్బంధించడం దుర్మార్గమని దళితహక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంబేపల్లెలో జరిగిన సీఎం చంద్రబాబు బహిరంగ సభలో విద్యార్థి సంఘాల నేతలు సీఎంను కలిసి తమ సమస్యలు చెప్పుకునేందుకు పోలీసులు అనుమతించకపోవడంతోనే వారు నిరసన తెలిపారన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి విద్యార్థి సంఘాల నేతలను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడం తగదన్నారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ నాయకులు రెడ్డి సుధాకర్, పెద్ద గంగయ్య పాల్గొన్నారు. కాగా, అన్యాయాన్ని ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధించడం ద్వారా ఉద్యమాలను ఆపలేరని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు నరసింహ, డి.వి.రమణ, శెట్టిపల్లె సాయికుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

బావిలో పడిన పాడి ఆవు



బావిలో పడిన పాడి ఆవు

పీలేరు రూరల్: ప్రమాదవశాత్తు ఓ పాడి ఆవు బావిలో పడిన సంఘటన పీలేరు పట్టణం కావలిపల్లెలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కావలిపల్లెకు చెందిన దేవి తన పాడి ఆవును సమీపంలో మేతకు తీసుకెళ్లింది. ఈ సమయంలో అక్కడున్న పాడుబడిన రక్షణలేని బావిలో పడింది. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పాడి ఆవును వెలికి తీసి కాపాడారు.



పాడి ఆవును బయటకు తీసిన అగ్నిమాపక సిబ్బంది

కుంపిణీపురం ఆంజనేయస్వామి ఆలయంలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాజంపేట : ఈనెల 4వ తేదీ నుంచి రాజంపేట నియోజకవర్గం నందలూరు మండలంలోని కుంపిణీపురం ఆంజనేయస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు ఉపనయనం, పంచామృతాభిషేకాలు, అర్చనలు ఉంటాయి. రెండవరోజు స్వామివారికి పంచామృతాభిషేకాలు ఉంటాయి. ఆరోజు మధ్యాహ్నం బండలాగుడు పోటీలు జరుగుతాయి. మూడవ రోజు రథోత్సవం ఉంటుంది.

తరలిరానున్న జాగీరుదారులు

కుంపిణీపురం వరాహ ఆంజనేయస్వామి ఉత్సవాలకు వివిధ రాష్ట్రాలలో ఉన్న జాగీరుదారులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది.

ఆలయ చరిత్ర..

రెండు శతాబ్దాల క్రితం మంత్రాలయానికి చెందిన అప్పాచార్యులుకు స్వప్నంలో ఆంజనేయస్వామి సాక్షాత్కారమై నేను ఫలానచోట రాతి జాడిలో ఉద్భవించానని చెప్పాడు. దీంతో ఆయన అక్కడి నుంచి అన్వేషించుకుంటూ రాజంపేట నియోజకవర్గం నందలూరు మండలంలో జాగీర్‌దారులు నివసిస్తున్న కుంపిణీపురం ప్రాంతానికి చేరుకున్నారు. అప్పట్లో రాతి జాడీలను తయారు చేసుకొని అందులో ఆవకాయను నిల్వచేసుకునేవారు. ఆ విధంగా లీలావాణికి చెందిన ఇంటిలో ఉన్న రాతిజాడలో ఆంజనేయస్వామి ఉద్భవించినట్లుగా గుర్తించారు. అనంతరం ఆయన స్వామివారిని ప్రతిష్ఠించారు. ఆలయ నిర్మాణం చేపట్టారు. మళ్లీ ఇక్కడి నుంచి మంత్రాలయం వెళ్లి అక్కడే సజీవ సమాధి అయ్యారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దక్షిణ ముఖంగా స్వయంభువుగా వెలసిన ఆంజనేయుడు ఉండటం ప్రత్యేక విశేషం.



రాతి ఆవకాయజాడిలో ఆవిర్భవించిన ఆంజనేయస్వామి ప్రతిమ



కుంపిణీపురంలోని భోగాంజనేయస్వామి ఆలయం

దేశంలో ఎక్కడాలేని ఆలయం



దేశంలో ఎక్కడాలేని విధంగా స్వయంభు దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయం కుంపిణీపురంలో ఉంది. రాతి ఆవకాయజాడిలో స్వామివారు ఉద్భవించడం విశేషం. దక్షిణ ముఖంగా ఆలయాలు ఉంటాయి. కానీ స్వయంభుగా వెలసిన స్వామి వారు లేరు. ప్రతి ఏడాది రథసప్తమి రోజున వరాహ ఆంజనేయస్వామి, కుంపిణీపురం ఆంజనేయస్వామిని భక్తులు కొలుస్తుంటారు.

– సహాపురం రఘునాథాచార్యులు, ఆలయ అర్చకులు

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం జ్యూస్‌ఫ్యాక్టరీ సమీపంలో నివాసం ఉన్న ఎస్.శ్రీనివాసులు(55) ఆటో తోలుకుని జీవిస్తున్నాడు. ఆదివారం ఈడిగపల్లె నుంచి ప్రయాణికులతో మదనపల్లెకు వస్తుండగా, చెక్‌పోస్ట్ వద్ద ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ శ్రీనివాసులుతో పాటు సునీత, డి.శ్రీనివాసులు గాయపడ్డారు. అదేవిధంగా పుంగనూరు మండలం బోడేవారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు గణేష్(26) ద్విచక్రవాహనంలో వస్తుండగా, పూజగానిపల్లె వద్ద బొలేరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దమండ్యం మండలం వెలిగల్లుకు చెందిన గుర్రప్ప కుమారుడు వెంకటరమణ(60) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది పురుగుమందు తాగాడు. అదేవిధంగా పుంగనూరు మండలం వనమలదిన్నెకు చెందిన జయచంద్ర(37) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. సాగు అవసరాల కోసం పలుచోట్ల అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిడి అధికం కావడంతో శనివారం రాత్రి ఇంటివద్దే పురుగు మందు తాగాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు, బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వృద్ధురాలిపై దాడి

కురబలకోట : కురబలకోటకు చెందిన వృద్ధురాలు బావాబీ (83)పై ఆమె తనయుడు దాడి చేశాడు. ఈమెకు ముగ్గురు సంతానం. అయినా ఒంటరి జీవితం గడుపుతోంది. భర్త నుంచి సంక్రమించిన భూమిలో సాగు చేసిన జొన్నపంటను ఆమెకు తెలియకుండా విక్రయించడంతో నిలదీసింది. దీంతో ఆగ్రహించిన కుమారుడు ఆమెపై దాడి చేసి గాయపరిచాడు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నప్రాసన రోజే అనంతలోకాలకు..



మృతి చెందిన చిన్నారి



మృతి చెందిన బిడ్డను చేతుల్లోకి తీసుకుని విలపిస్తున్న కుటుంబీకులు

మదనపల్లె : ఆరు నెలలు నిండకుండానే ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. గుర్రంకొండ మండలం మర్రిమాకులపల్లెకు చెందిన బాలాజీ, భారతిలకు ఒకటిన్నర సంవత్సరం క్రితం వివాహమైంది. వీరికి ఐదునెలల క్రితం మొదటి కాన్పులో మగ శిశువు జన్మించాడు. ఆరోనెలలో పడిన వెంటనే చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమం స్థానికంగా ఉన్న ఓ ఆలయంలో ఘనంగా చేసేందుకు నిర్ణయించి ఆదివారం బంధుమిత్రులను ఆహ్వానించారు. కార్యక్రమం అనంతరం చిన్నారిని తీసుకుని ఇంటికి వస్తుండగా ఉన్నట్లుండి అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే తల్లిదండ్రులు చిన్నారిని వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మదనపల్లెకు రెఫర్ చేశారు. హుటాహుటిన చిన్నారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. అత్యవసర విభాగ వైద్యులు పరీక్షించి, అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఆరునెలలు నిండకుండానే అనంతలోకాలకు చేరుకున్నావా.. చిట్టి తండ్రీ అంటూ చిన్నారిని చేతుల్లోకి తీసుకుని ఆర్తనాదాలు చేశారు.

నిందితులను పట్టుకుంటాం



బిదినంచర్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ వెంకటరమణ

సింహాద్రిపురం : వృద్ధురాలి మృతి కేసులో త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. మండలంలోని బిదినంచర్ల గ్రామానికి చెందిన వై.పార్వతమ్మ అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతురాలి కుమారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పులివెందుల రూరల్ సీఐ వెంకట రమణ ఘటనా స్థలాన్ని పరిశీలించి గ్రామస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

కాగా వృద్ధురాలి మృతి కేసు దర్యాప్తులో భాగంగా డాగ్ స్క్వాడ్‌ను రప్పించగా, అది ఓ అనుమానిత వ్యక్తి ఇంటిలోకి నేరుగా వెళ్లిందని ఎస్ఐ తెలిపారు.అలాగే మృతదేహాన్ని తరలించేందుకు వీలు లేకపోవడంతో సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించామన్నారు.

బ్యాంకులో దొంగతనం కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ


జమ్మలమడుగు : జమ్మలమడుగులోని కెనరా బ్యాంకులో ఐదు రోజుల క్రితం పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి సావిత్రి అనే మహిళకు సంబంధించిన బంగారాన్ని చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. తమ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీ ఫుటేజీల ఆధారంతో దొంగలను పట్టుకున్నారన్నారు. నిందితులు అనంతపురం జిల్లా మారుతినగర్, గుత్తి టౌన్‌కు చెందిన వనార్పి అనంతమ్మ, ఆమె కుమారుడు మహేష్, కోడలు గాయత్రిగా గుర్తించామన్నారు. ఆదివారం తాడిపత్రి బైపాస్ రోడ్డులో ఓమినీ కారులో పారిపోతుండగా సీఐ లింగప్ప, ఎస్ఐ బి.రామకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ దేవదాసు, రియాజ్, నాగేంద్ర చాకచక్యంగా వారిని పట్టుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి 11 తులాల బంగారంతోపాటు ఓమిని కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.బ్యాంకు అధికారులు బ్యాంకుల్లో దొంగతనం జరిగినప్పుడు తమకు పట్టనట్లు ఉండటంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని డీఎస్పీ అభిప్రాయపడ్డారు. ఇటీవల కెనరా బ్యాంకులో అధికారులు అప్రమత్తంగా లేకపోవడంతోనే దొంగలు బ్యాంకు నుంచి వెళ్లిపోయారన్నారు. దొంగతనం జరిగినప్పుడు బ్యాంకు అధికారులు వెంటనే లోపల సోదాలు నిర్వహిస్తే దొంగలు తప్పించుకునేందుకు వీలుండదని చెప్పారు. ఈ సమావేశంలో అర్బన్ సీఐ లింగప్ప పాల్గొన్నారు.

మేధావుల మౌనం దేశానికి నష్టం

కడప ఎడ్యుకేషన్ : మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం అని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్న వేళ ఆ సమస్యల పరిష్కారానికి ఒకటో, రెండో సంస్థలు పనిచేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, భావసారూప్యంగల అన్ని సంస్థలు కలిసి పనిచేసినప్పుడే సాధ్యమన్నారు. కడప నగరంలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయ పార్టీలుగానీ, సామాజిక సేవా సంస్థలుగాని ఒకే మూసలో పనిచేస్తే ప్రజల్లో నిలబడలేవన్నారు. ప్రజలకు అర్థమయ్యే పద్ధతిలో, ప్రయోజనం కలిగించే విధానంలో పని చేయాలన్నారు. జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు బి. విశ్వనాథ మాట్లాడుతూ ప్రతి సంస్థ మూడో తరం నాయకత్వ లోపంతో సతమతమవుతోందన్నారు. ఈ లోపాన్ని అధిగమించాలన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకుడు కొర్రా సురేష్ బాబు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకోసం మేధావి వర్గం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.

జానపద సాహిత్య పరిశోధన శిఖరం 'తంగిరాల'

పలు సంఘాల నేతల నివాళి



తంగిరాల వెంకట సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాలు, పార్టీల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జానపద సాహిత్య పరిశోధన శిఖరం ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు అని వివిధ సంఘాలు, పార్టీల నేతలు కొనియాడారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన తంగిరాల సుబ్బారావు సంస్మరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. తొలుత చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ త్యాగం, దాతృత్వాలకు ప్రతీకలైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డిలకు సరైన గుర్తింపు, గౌరవం లభించలేదన్నారు. రాయలసీమ ప్రాంతానికి అనాదిగా సాంస్కృతిక పరంగా, సాహిత్య పరంగా అన్యాయం జరుగుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో రేనాటి పల్లెల్లో విస్తృతంగా పర్యటించి తన పరిశోధనల ద్వారా ఉయ్యాలవాడ, బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్రలను వెలికి తీసి పుస్తక రూపంలో అందించిన తంగిరాలను రాయలసీమ ప్రజలు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో త్యాగాలు చేసిన రాయలసీమ అజ్ఞాత వీరుల చరిత్రలను వెలికితీసి నేటి తరానికి అందించడమే తంగిరాల కృషికి కొనసాగింపు అవుతుందన్నారు. భూతపురి సుబ్రమణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ వీరగాథ సాహిత్య పరిశోధనలో తంగిరాల మేటి అని, ఆయన మరణం సాహిత్య రంగానికి తీరని లోటన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ తంగిరాల మరణం రాయలసీమ జానపద సాహిత్యానికి తీరని లోటన్నారు. జానపద సాహిత్యంపై పరిశోధనకు విశ్వవిద్యాలయాల్లో తంగిరాల పునాదులు వేశారని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తాను పంపిన సందేశంలో పేర్కొన్నారు. తెలుగుభాషా మిత్ర మండలి నాయకులు డాక్టర్ జీవీ సాయిప్రసాద్, డాక్టర్ అనుగూరు చంద్రశేఖర్‌రెడ్డిలు పంపిన తమ సందేశంలో తంగిరాల మహోన్నత సాహితీమూర్తిగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి జిల్లా కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, జానమద్ది సాహితీపీఠం అధ్యక్షుడు జానమద్ది విజయభాస్కర్, సీపీఐ నాయకులు సావంత్ సుధాకర్ రావు, మల్లికార్జునరెడ్డి, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్వీ భాస్కర్‌రెడ్డి, రామశేఖర్ రెడ్డి, ఆర్‌ఎస్‌పీ నాయకుడు సుబ్బరాయుడు, ఏపీ దళితమిత్ర అధ్యక్షుడు కై పు రామాంజనేయులు, లోక్‌సత్తా నాయకుడు దేవరశ్రీకృష్ణ, రెవెల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్, పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకుడు ఓరుగంటి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.